క్లుప్తంగా

నిత్యావసర సరుకులు పంపిణీ


నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కంపోస్టు కాలనీలో నివాసం ఉంటున్న ఒంటరి పేద మహిళకు బూర్జ ఎస్ఐ మొజ్జాడ ప్రవల్లిక నిత్యావసర సరుకులను సోమవారం అందజేశారు. గేదెల లక్ష్మీ భర్త ఇటీవల అనారోగ్యంతో మరణించగా, ఆమె కూడా అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో పెద్దపాడుకు చెందిన బొట్టా సాయికుమార్, రెడ్‌క్రాస్ ప్రతినిధి నంది ఉమాశంకర్, స్టేట్ బ్యాంకు అసోసియేట్ నల్ల గౌతమి చేతులమీదుగా కొంతనగదు, సరుకులు అందించారు.

27న సర్వసభ్య సమావేశం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈనెల 27వ తేదీన రెడ్‌క్రాస్ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి రెడ్‌క్రాస్ సభ్యులు, పేట్రన్లు, వైస్ పేట్రన్లు, కమిటీ సభ్యులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో రెడ్‌క్రాస్‌కు విరాళాలు అందించిన దాతలు, రక్తదాన శిబిరాల నిర్వాహకులు, నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులు, రెడ్‌క్రాస్ వలంటీర్లను సత్కరించనున్నట్లు పేర్కొన్నారు.

అప్రోచ్ రోడ్డు కోసం భవనాలు కూల్చివేత


ప్రభుత్వ భవనాలు కూల్చివేస్తున్న దృశ్యం

గార: వంశధార నదిపై గార- పోలాకి వంతెన అప్రోచ్ రోడ్డు నిర్మాణం కోసం అందులో ఉన్న ప్రభుత్వ భవనాల కూల్చివేతను సోమవారం ప్రారంభించారు. నరసన్నపేట ఆర్అండ్‌బీ అధికారులు వీటిని పర్యవేక్షిస్తున్నారు. పశుసంవర్ధక ఏడీ కార్యాలయం, వెలుగు భవనం, మండల విద్యాశాఖ కార్యాలయం, పోలీసు స్టేషన్లు వీటిలో ఉండగా, పశుసంవర్ధక శాఖ ఏడీ కార్యాలయం, పాత తహసీల్దార్ కార్యాలయం, మండల విద్యాశాఖ కార్యాలయం ఇంటిగ్రేడ్ హాస్టల్‌లోకి మార్చారు. పోలీస్‌స్టేషన్‌ను పాత మండల పరిషత్ కార్యాలయంలోకి త్వరలో మార్చనున్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్


సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసిన దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులచే సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌లో అగ్నిపర్వతం, వాటర్ ప్యూరిఫైయర్ మొదలగు వాటిని విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయుడు ప్రభాకరరావు మాట్లాడుతూ చిన్నప్పటినుంచే విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తి అవసరమన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వీవీజీఎస్ శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ పీవీ భాస్కరరాజా, సిబ్బంది గణేష్ పాల్గొన్నారు.

దేశ సమగ్రత కోసం ఉద్యమించాలి


ర్యాలీ చేస్తున్న సీపీఎం పార్టీ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మత సామరస్యం, దేశ సమగ్రత కోసం ఐక్యంగా ఉద్యమించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యవర్గ సభ్యుడు బి.కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. శ్రీకాకుళం నగరంలో సోమవారం స్థానిక డైమండ్ పార్క్ నుంచి సూర్యమహల్ వరకు సమైక్యత యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదం, మతోన్మాదం నశించాలని నినాదాలు చేశారు. పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు తీసిన ఉగ్రవాదులను పట్టుకోవడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ర్యాలీలో పి.తేజేశ్వరరావు, ఆర్.ప్రకాష్, కె.సూరయ్య, ఎం.సత్యం, బి.లక్ష్మి, పి.సుధాకర్, డి.చందు, డి.పార్వతీశం పాల్గొన్నారు.

పోయాం మోసం..!


వైఎస్సార్ ఆసరాలో పాల్గొన్న మహిళలు(ఫైల్)

- కూటమి పాలనలో మోసపోయిన మహిళలు
- ఏడాది కాలంలో హామీలు అమలు చేయని వైనం



మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తే కుటుంబాలు బలోపేతమవుతాయని నమ్ముతూ వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను మహిళల పేరిట అమలు చేశారు. ఎక్కువ శాతం సంక్షేమ పథకాల డబ్బులు మహిళల బ్యాంకు ఖాతాల్లోనే పడేలా చర్యలు తీసుకున్నారు. మహిళల పేరుతో ఇంటి పట్టా అందజేసి వాళ్లను యజమానులు చేశారు. అలాగే అమ్మ ఒడి, చేయూత, ఆసరా వంటి ఎన్నో పథకాలు అందించి అన్నగా అండగా నిలిచాడు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలంలో మహిళలను మోసం తప్ప ఎటువంటి సాయం చేయలేదు. ఉచిత బస్సు, తల్లికి వందనం, నెలకు రూ.1500 ఇస్తామన్న హామీపై ఒక్కమాట కూడా మాట్లాడడం లేదు. ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ప్రకటనలే తప్పా వందలాది మందికి వేర్వేరు కారణాలు చూపి నగదు జమ చేయడం లేదు. ఇంటి వద్దకే వచ్చే రేషన్ సరుకుల వ్యవస్థ అయిన ఎండీయూను రద్దు చేసి మరలా డిపోల వద్ద కాపలా ఉండేలా ఇబ్బందులుకు గురి చేస్తున్నారు. దీంతో ప్రస్తుత ప్రభుత్వంలో అతివకు అవస్థలు తప్పడం లేదు.

– గార

ప్రకటనలే తప్ప అమలులేదు



ఏడాదిగా పథకాలు అమలు చేస్తామని చెప్పడమే తప్ప చేయడం లేదు. మహిళలకు అన్నివిధాలుగా మేలు చేస్తామని చెప్పి ఒక్క పథకం కూడా ఇవ్వలేదు. తల్లికి వందనం, ప్రతినెలా రూ.1500, ఉచిత బస్సు ప్రయాణమని చెప్పి ఇంతవరకు అమలు చేయకపోవడం బాధాకరం.

– ఆర్.ఝాన్సీరాణి, చింతువలస

మోసం చేశారు



ఎన్నికల్లో గెలుపు కోసం మాయమాటలు చెప్పి చంద్రబాబు, టీడీపీ నాయకులు మోసం చేశారు. అమలు చేయలేని హామీలిచ్చారు. ఏడాదిగా మహిళల పేరిట ఒక్క పథకం కూడా అమలు చేయలేదు. ప్రజలంతా చంద్రబాబు మోసాన్ని ఇప్పటికే అర్థం చేసుకున్నారు. సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటారు.

– అందవరపు రామలక్ష్మి, వైస్ ఎంపీపీ, గార

యాంత్రీకరణతో అధిక దిగుబడులు


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

శ్రీకాకుళం రూరల్: యాంత్రీకరణ పద్ధతిలో వరి నాటుకోవడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. సోమవారం శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురంలో కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయశాఖ సంయుక్తంగా వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. పొడి వెద పద్ధతిలో వరి సాగు చేసే రైతులు విత్తనం, ఎరువులు ఒకేసారి యంత్రంతో వేసుకోవడం వలన ఖర్చు ఆదా అవుతుందన్నారు. వరిని ఆశించే చీడపీడలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వరి పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్‌గాంధీ సూచించారు. తొలకరిలో ఆశించి నష్టపరిచే చీడపీడల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. వ్యవసాయ పరిశోధనా మండలి శాస్త్రవేత్త ఆనందితా పాల్ మాట్లాడుతూ యువత వృత్తి నైపుణ్యత శిక్షణలు నేర్చుకొని ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆత్మ పథకం డీపీడీ డాక్టర్ వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయాధికారి ఉషబూకుమారి, అడ్వకేట్ అన్నపూర్ణమ్మ, సర్పంచ్ ఆదిత్య నాయుడు, అనుబంధ రంగాల సిబ్బంది పాల్గొన్నారు.

కొలతల మేరకు వేతనం


వేతనదారులతో మాట్లాడుతున్న డ్వామా పీడీ సుధాకరరావు

ఎచ్చెర్ల: ఉపాధి వేతనదారులకు కొలతలు మేరకు వేతనం వచ్చేలా చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ బి.సుధాకరరావు తెలిపారు. మండలంలోని ఫరీదుపేట గ్రామంలో నారాయణపురం కుడి కాలువ పూడికతీత పనులను సోమవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేతనదారులు సమయపాలన పాటించాలని సూచించారు. పనులు ఏవిధంగా చేయాలి, కొలతలు ఏవిధంగా వేస్తారనే విషయాలను వివరించారు. వేతనదారులు మాట్లాడుతూ తమకు రోజుకు రూ.20 వేతనం వేశారని, కావాలనే అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తొలి మూడు వారాలకు రోజుకు రూ.200లు వేసి, నాలుగో వారానికి రోజుకు రూ.20లు మాత్రమే వేశారన్నారు. పీడీ స్పందిస్తూ ప్రస్తుతం కాలువలో నీరు వచ్చిందని, కొలతలు వేయడం సాధ్యం కాదన్నారు. భవిష్యత్‌లో వేతనదారులు చేసిన పనికితగ్గ కూలీ అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కొత్తకోట అమ్మినాయుడు, ఏపీడీ కె.లోకేశ్వరరావు, ఏపీవో శోభాదేవి, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన విద్యార్థులు


బుడుమూరు విక్రమ్‌రాజా తల్లిదండ్రులను అభినందిస్తున్న శ్రీచైతన్య కళాశాల ప్రతినిధులు


జేఈఈ అడ్వాన్స్‌లో నారాయణ కళాశాల టాపర్లను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో చదువుకుంటూ జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో పూర్తి హవా కనబర్చి విజయబావుటా ఎగురవేసిన విద్యార్థులను ఆ విద్యాసంస్థల ఏజీఎం పి.నర్సునాయుడు, డీఎన్ కె.మురళీధర్, ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణ తదితరులు అభినందించారు. మెరుగైన ర్యాంకులు సాధించి కళాశాలకు గర్వకారణంగా నిలిచారని కొనియాడారు. తీర్చిదిద్దిన అధ్యాపకులను, ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను మెచ్చుకున్నారు.

నారాయణ కళాశాల విద్యార్థుల జోరు..

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో నాణ్యమైన ర్యాంకులు సాధించి జోరు కనబర్చిన విద్యార్థులను ఆ విద్యాసంస్థల నార్త్‌కోస్టల్ డీన్ డి.హనుమంతరావు, డీఎన్ ఆర్.మణికుమార్, అసిస్టెంట్ డీజీఎం బి.తిరుపతిరావు, ఏజీఎం కె.గంగాధర్, తదితరులు అభినందించారు. సోమవారం కళాశాలలో ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో విద్యార్థులను, అధ్యాపకులను మెచ్చుకున్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి


పర్యావరణ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

రణస్థలం: ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని స్వచ్ఛ భారత్ మిషన్ జిల్లా కో–ఆర్డినేటర్ కె.అమ్మాజీరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం ప్రచారం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 22 నుంచి జూన్ 5 వరకు ప్రచార కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతున్నాయన్నారు. పచ్చదనమే ప్రకృతి ధనమని, రోడ్లుపై చెత్త వేయకుండా పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని సూచించారు. ఆరుబయట మల విసర్జన ఆరోగ్యానికి హానికరమని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు, ఈవోపీఆర్డీ ప్రకాశ్‌రావు, ఎంపీఎం మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు స్వీకరణ


వందాన హరిబాబు

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలోని తపాలాశాఖలో పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో డైరెక్ట్ ఏజెంట్లుగా పనిచేసేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తపాలాశాఖ సూపరింటెండెంట్ వందాన హరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ పాస్ అయిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు పూర్తి వివరాలకు దగ్గరలోని పోస్టాఫీసును సంప్రదించాలన్నారు. దరఖాస్తులను స్వీకరించేందుకు జూన్ 10 ఆఖరు తేది అని, దరఖాస్తులు సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్, శ్రీకాకుళం డివిజన్ – 532 001 చిరునామాకు రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా కానీ స్పీడ్ పోస్ట్ ద్వారా కానీ పంపించాలని సూచించారు. సదరు దరఖాస్తుతో ఆధార్ కార్డు మరియు పాన్ కార్డు జిరాక్స్ పంపించాలని కోరారు.

సచివాలయ సిబ్బందిపై వేధింపులు ఆపాలి


ర్యాలీగా వెళ్తున్న సచివాలయ ఉద్యోగులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కూటమి ప్రభుత్వం సచివాలయ సిబ్బందిపై వేధింపులు ఆపాలని జీఎస్‌డబ్ల్యూస్ అసోసియేషన్, నగరపాలక సంస్థ ఉద్యోగులు అన్నారు. అధికారంలోకి వచ్చాక సచివాలయ ఉద్యోగులపై కక్షసాధింపుగా అన్ని రకాల పనులు అప్పగించి రాత్రింబవళ్లు పనిచేయించడం వల్లే తీవ్ర ఒత్తిడికి గురై ఉద్యోగులు మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సచివాలయ ఉద్యోగుల పని ఒత్తిడితో తమ తోటి సచివాలయ ఉద్యోగి దాలినాయుడు గుండెపోటుతో విధి నిర్వహణలో మరణించడం బాధాకరమన్నారు. దాలినాయుడి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ కార్పొరేషన్ కార్యాలయం నుంచి వైఎస్సార్ కూడలి వరకు శాంతియుత ర్యాలీ సోమవారం నిర్వహించి మౌనం పాటించారు. సచివాలయ ఉద్యోగులపై కలెక్టర్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల ఒత్తిడి తీవ్రంగా ఉందని, ఇళ్లకు ఏ సమయంలో వెళ్తున్నామో ఏ సమయానికి తింటున్నామో తెలియని పరిస్థితిలో ఉన్నామన్నారు. సంబంధం లేని పనులు సైతం తమకు అప్పగించి కార్మికుల్లా చూడడం తగదన్నారు. సచివాలయ సిబ్బందికి టార్గెట్లు పెట్టి మరీ వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 6 గంటలకు యోగా కార్యక్రమంతో ప్రారంభమైన ఉద్యోగం, రాత్రి 10 గంటల వరకు సాగుతోందన్నారు. యోగా పేరుతో బాలింతలైన ఉద్యోగినులను సైతం వేధించడం సరికాదన్నారు. తమ బాధలను అధికారులు సహృదయంతో అర్థం చేసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బొప్పాయి సాగు.. లాభాలు బాగు



- ఎచ్చెర్ల నియోజకవర్గంలో విస్తరిస్తున్న సాగు
- యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల: ఆరోగ్య జాగ్రత్తల్లో భాగంగా ప్రతి ఒక్కరూ తీసుకునే పండ్లలో బొప్పాయిది ప్రథమ స్థానం. మధుమేహ వ్యాధితో బాధపడుతున్నవారు సైతం బొప్పాయి తినొచ్చని వైద్యులు సూచిస్తుంటారు. మనిషిలో రక్తాన్ని శుద్ధి చేసే గొప్పగుణం బొప్పాయికి ఉంటుంది. అలాంటి బొప్పాయి పంటకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. దీంతో ఎచ్చెర్ల నియోజకవర్గంలో రైతులు బొప్పాయి సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. క్రమంగా ఈ పంట సాగు విస్తీర్ణం పెరుగుతోంది. బొప్పాయి సాగుపై ఉద్యానవన శాఖ అధికారులు రైతులకు సూచనలు అందిస్తున్నారు. ప్రభుత్వాలు ఈ పంట సాగుకు ప్రోత్సాహకాలు అందిస్తున్నాయని వివరిస్తున్నారు. బొప్పాయి సాగుకు గత ప్రభుత్వంలో అందించిన రాయితీలు, ప్రోత్సాహకాలను ప్రస్తుత ప్రభుత్వం కూడా కొనసాగిస్తోంది. నియోజకవర్గంలోని ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం, జి.సిగడాం మండలాల్లో 250 ఎకరాల్లో బొప్పాయి సాగు చేస్తున్నారు. లావేరులో 80, జి.సిగడాంలో 50, రణస్థలంలో 70, ఎచ్చెర్లలో 50 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. స్థానిక వ్యాపారులతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున వ్యాపారులు పొలాల వద్దకే వచ్చి పంటను కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులకు పంట రవాణా ఖర్చు కూడా తగ్గుతోంది.

ఖర్చు తక్కువ ఆదాయం ఎక్కువ

బొప్పాయి సాగులో రైతులు మంచి లాభాలు పొందవచ్చని ఉద్యానవన శాఖాధికారులు చెబుతున్నారు. అధికారుల సూచనలు పాటిస్తూ సస్యరక్షణ చర్యలు చేపడితే ఎకరానికి 60 టన్నుల వరకు పంట దిగుబడి వస్తుందని తెలియజేస్తున్నారు. ఎకరా సాగుకు రూ.70 వేల వరకు ఖర్చు అవుతుందని, పంట దిగుబడి బాగుంటే రూ.3 లక్షల వరకూ ఆదాయం పొందవచ్చని అంటున్నారు. అలాగే బొప్పాయి సాగుకు గత ప్రభుత్వంలో అమలు చేసిన రాయితీలను ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తోంది. ఈ రాయితీల కోసం రైతులు రైతు సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకుని విత్తనాలు, ఎరువులు, స్ప్రేయింగ్ కెమికల్స్ బిల్లులు, పంట ఫొటో జతచేయాల్సి ఉంటుంది. అలాగే పంట సాగులో మల్చింగ్ కోసం మొక్క చుట్టూ మట్టిని కప్పి ఉంచడానికి పాలథిన్ ఫిల్మ్ కప్పాల్సి ఉంటుంది. దీంతో మొక్క వృద్ధి చెందుతుంది. దీని కోసం హెక్టారుకు రూ.16 వేలు అందించనున్నారు. అలాగే మైక్రో ఇరిగేషన్‌లో భాగంగా డ్రిప్ పరికరాలు కావాల్సిన రైతులకు హెక్టారుకు రూ.80 వేలు విలువైన పరికరాలను రాయితీపై అందిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

బొప్పాయి సాగుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. హెక్టారుకు రూ.18,500 సాగు ప్రోత్సాహంతో పాటు మల్చింగ్ కోసం రూ.16 వేలు అందజేస్తున్నారు. డ్రిప్ కోసం హెక్టారుకు రూ.80 వేల వరకు రాయితీ కల్పిస్తున్నారు. తక్కువ ఖర్చుతో అధిక లాభాలు ఆర్జించే బొప్పాయి సాగుపై రైతులు దృష్టి సారించాలి.

– సుదర్శిని, ఉద్యానవన శాఖాధికారి, ఎచ్చెర్ల

పరామర్శ


దాలినాయుడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని చిన్నమురపాక గ్రామానికి చెందిన కార్యకర్త మజ్జి వెంకటప్పడు ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడ్డారు. దీంతో ఆయనను మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సోమవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు జెడ్పీటీసీ సీతంనాయుడు, సూర్యనారాయణ, కిల్లారి మల్లేశ్వరరావు, వెంకటప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని మెట్టవలస గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మీసాల దాలినాయుడు కుమారుడు లక్ష్మణరావు ఇటీవల మృతి చెందారు. దీంతో వారి కుటుంబాన్ని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సోమవారం పరామర్శించారు. ఆయనతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు దన్నాన రాజీనాయుడు, జెడ్పీటీసీ సీతంనాయుడు, కరిమజ్జి రామారావు, మీసాల నారాయణరావు, మీసాల రమణ, రాము, ప్రసాద్, రామారావు, రమణ, వినోద్ తదితరులు ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

జి.సిగడాం: ఈనెల 4వ తేదీన నిర్వహించనున్న వెన్నుపోటు దినం పోస్టర్‌ను వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు డోల వెంకటరమణ, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ ఆధ్వర్యంలో సోమవారం అవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి నాయకులు ఎన్నికల ముందు ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక ఓటు వేసిన ప్రజలకే వెన్నుపోటు పొడిచారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల నియోజకవర్గ ఆర్టీఐ అధ్యక్షుడు వెలిది సాయిరాం, ఎంపీటీసీ సభ్యుడు కీర్తి సత్యం నాయుడు, కార్యకర్తలు మజ్జి గురినాయుడు, కీర్తి లక్ష్మంనాయుడు, తొంగ్రోతు సత్తిబాబు, కెల్ల చిన్నంనాయుడు, కారు నాగరాజు, ఎం గణపతి, దుర్గాశి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం విజయవంతం చేద్దాం


మాట్లాడుతున్న పీస గోపి


సమావేశంలో పాల్గొన్న పార్టీ నాయకులు


మాట్లాడుతున్న పేడాడ శ్రీరామమూర్తి

గార: ఈనెల 4వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంపీపీ గొండు రఘురామ్ పిలుపునిచ్చారు. శ్రీకూర్మం జంక్షన్‌లోని మిల్లు ఆవరణలో సోమవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పీస గోపి అధ్యక్షతన మండల పార్టీ విభాగాల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చిన కూటమి నాయకులు, అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచారని మండిపడ్డారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని దుయ్యబట్టారు. సమావేశంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మార్పు దుర్గా పృథ్వీరాజ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ముంజేటి కృష్ణమూర్తి, మత్స్యకార సంఘం అధ్యక్షుడు కోనాడ నర్సింగరావు, అందవరపు బాలకృష్ణమూర్తి, అరవల రామకృష్ణ, పీస శ్రీహరిరావు, యాళ్ల నారాయణమూర్తి, కొయ్యాన నాగభూషణం, తమ్మిన అప్పలరాజు, గంగు రామారావు, శిమ్మ ధర్మరాజు, గొలివి వెంకటరమణమూర్తి, కె.సురేష్, బరాటం నాగరాజు, యువజన విభాగం అధ్యక్షుడు గొండు భరత్, కొలకట రజనీసు భాషిణి దేవి తదితరులు పాల్గొన్నారు.

జి.సిగడాం: ఏడాది పాలనలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి అన్నారు. ఈ మేరకు ఈనెల 4వ తేదీన నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని దవళపేట గ్రామంలో సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓట్లు వేసిన ప్రజలను ఇబ్బందులకు గురి చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. మండుటెండలో పని చేస్తున్న ఉపాధి హామీ వేతనదారులకు ఇంతవరకు వేతనాలు చెల్లించలేదని మండిపడ్డారు. రేషన్ వాహనాలు తీసివేయడంతో ప్రజలు డిపోల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ వడిశ మహేశ్వరరావు, కంచరాన రమణారావు, పేడాడ కృష్ణంరాజు, పేడాడ శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

శ్రీకాకుళం : 9951602845, 9951602849, 9912220367, 9705444191, 9010299083
ఎచ్చెర్ల : 9951602849
Office mail : sklmadvt@gmail.com